క్లుప్తంగా

పలు కుటుంబాలను పరామర్శించిన వెంకటేష్



వైదనలో సర్పంచ్, జయలక్ష్మిని పరామర్శిస్తున్న వెంకటేష్

బల్లికురవ: మండలంలోని వైదన, కొమ్మినే నివారి పాలెం, గ్రామాల్లో సర్పంచ్‌తోపాటు పది కుటుంబాలను చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ గురువారం పరామర్శించారు. వైదన గ్రామ సర్పంచ్ మేడా జయలక్ష్మి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితులను తెలుకున్నారు. గ్రామంలోని షేక్ చాంద్ అనారోగ్యంతో బాధపడుతుండగా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొమ్మివానిపాలెం గ్రామంలో పలు కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, కేవీ పాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు దర్శి రామకృష్ణయ్య, స్థానిక నేతలు యం. శివదుర్గా, చింతల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించాలి

మార్టూరు: ప్రత్యేక అవసరాలు కలిగిన విభిన్న ప్రతిభావంతులైన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంఈఓ ఎంసీహెచ్ వస్త్రాం నాయక్ గురువారం తెలిపారు. మే 13వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ సర్వేలో 18 సంవత్సరాల వయస్సులోపు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించనున్నట్లు తెలిపారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి వారికి అవసరమైన ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు 21 రకాలుగా ప్రభుత్వం గుర్తించిందని.. స్థానిక భవిత కేంద్రాల ద్వారా వారికి అవసరమైన విద్య, కిట్లు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ట్యాబ్‌లు ఉచితంగా సమగ్ర శిక్షణ అందిస్తారని నాయక్ తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గురించి సమాచారం 8247500477 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. ఎంఈఓ 2 ప్రేమలత, ఈఈఆర్‌టీలు సీహెచ్ నాగ కుమారి, షేక్ ఆయుష పర్వాన్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న బైక్.. ఒకరికి గాయాలు


మేదరమెట్ల: ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన మోటారు బైకు కారును ఢీ కొన్న సంఘటన కొరిశపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం చోటు చేసుకుంది. ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న కారు కొరిశపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి రాగానే ఎదురుగా మోటారు బైకు రావడంతో అదుపు తప్పిన కారు బైకును ఢీ కొంది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్ నడుపుతున్న వ్యక్తికి గాయాలు కాగా వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం పునర్వసు నక్షత్రం చవితి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

జె.పంగులూరు: మండలంలోని బైటమంజులూరు గ్రామంలో గురువారం సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యులుగా గణిత అధ్యాపకులు డాక్టర్ ఎస్. లెనిన్ బాబు హాజరయ్యారు. 7 నుంచి 10 తరగతి వరకు 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు ఇచ్చిన లెక్కలను వేగంగా పూర్తిచేసిన వారికి బహుమతులు అందజేశారు. వేసవి కాలంలో ఖాళీగా కూర్చోకుండా వారికి ఇష్టమైన సబ్జెక్టులో పాఠశాలు నేర్చుకోవడం మంచిదన్నారు. ప్రస్తుత సమాజంలో చిన్నతనం నుంచే విద్యార్థులు అనేక పెడదారులు పడుతున్నారని, వాటికి దూరంగా విద్యార్థులను ఐక్యపరిచి సామాజిక కోణంలో మంచి లక్షణాలు నేర్పించేందుకు ఈ సమ్మర్ క్యాంపు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

రామ..రామాయపాలెం



బీటీ లేచిపోయి గోతులమయమైన రోడ్డు



పగుళ్లిచ్చిన సీసీ రహదారి

- గోతుల మయంగా మారిన పంచాయతీరాజ్ రహదారి
- బద్దలుగా పగిలిన సీసీ రోడ్డు
- అవస్థలు పడుతున్న వాహన చోదకులు

అద్దంకి: తిమ్మాయపాలెం గ్రామంలో ఉండే దర్శి రహదారి నుంచి రామాయపాలెం వెళ్లే సీసీ, బీటీ రహదారిని చూసేవాళ్లు రామ రామ రామరాయపాలెం రహదారి అనాల్సిందే. ఎటు చూసినా గోతుల మయంగా మారడంతో ప్రయాణం నరక ప్రాయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి ప్యాచ్ వర్కు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేశారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రహదారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. దాంతో అర కిలోమీటరు సీసీ, ఒక కిలోమీటరు బీటీ రహదారి గోతులమయంగా మారింది. బాపట్ల జిల్లా, ప్రకాశం జిల్లాలోని గ్రామాలను కలుపుతూ వెళ్లే ఈ రహదారి ప్రధానమైంది. తిమ్మాయపాలెం నుంచి రామాయపాలెం, ప్రకాశం జిల్లాలోని బట్లపల్లి, నూజిళ్లపల్లి, మారెళ్ల, మక్కెనవారిపాలెం గ్రామాల నుంచి నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారి నుంచి ప్రయాణిస్తుంటాయి.

రెండు బడులు, ఒక గుడి

తిమ్మాయపాలెం నుంచి రామాయపాలెం వెళ్లే రహదారిలో ఒక ప్రాథమిక పాఠశాల, ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దేవస్థానం ఉంది. అక్కడ నుంచి బీటీ రహదారి మొదలువుతుంది. అయితే అడుగడుగునా గోతులు, ఆ గోతుల్లో మట్టి పేరుకుపోయింది. మరి కొంత దూరం పూర్తిగా బీటీ లేచిపోవడంతో కనీసం రామాయపాలెం గ్రామానికి ఆటో కూడా వెళ్లే పరిస్థితి లేదు. వర్షం పడితే సీసీ ప్రాంతమంతా బుదరమయంగా మారుతోంది. బడి పిల్లలు సైతం బురదలో వెళ్లాల్సి వస్తోంది.

రెండు జిల్లాలతో తంటా..

ఈ రహదారి బాపట్ల, ప్రకాశం, జిల్లాలను అనుసంధానించే రహదారి కావడం, పంచాయతీరాజ్ స్పెషన్ అధికారుల పర్యవేక్షణలోనిది కావడంతో ఈ రహదారి దుస్థితికి చేరిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా రెండు జిల్లాలకు చెందిన ఆయా పీఆర్‌ల పరిధిలోని అధికారులు, మంత్రి పట్టించుకుని రహదారికి బీటీ, సీసీ మంజూరు చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పెట్టాం

ఇది రెండు జిల్లాల పరిధిలో ఉంది. తమ పరిధిలో 1.8 కిలోమీటర్లు మాత్రమే ఉంది. మిగిలిన రహదారి ప్రకాశం జిల్లాలోని తాళ్లూరు పీఐయూ పరిధిలో ఉంది. ఈ విషయం వారికి తెలియజేశాం. మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాం. త్వరలో రహదారి శాంక్షన్ అయ్యే అవకాశం ఉంది.

– రమేశ్, పీఐయూ

రహదారికి మరమ్మతులు చేయాలి



రామాయపాలెం వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. మొదట్లో సీసీ బద్దలుగా పగిలిపోయింది. బీటీ గోతులమయంగా మారింది. ఆటోలు వెళ్లాలన్నా వెళ్లడం లేదు.

– సాంబిరెడ్డి, మాజీ సర్పంచ్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

అద్దంకి: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి డి. నాగ వెంకటలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక కోర్టు హాలులో అవగాహన కార్యక్రమాని నిర్వహించారు. ప్రదేశంలో మహిళలపై లైగింక వేధింపుల చట్టం గురించి పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టం గురించి అవగాహన కల్పించడం ద్వారా పని ప్రదేశంలో మహిళలకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించవచ్చని చెప్పారు. అన్ని రకాల పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, ఫిర్యాదులను పరిష్కరించడానికి ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. దాని కోసం ఒక అంతర్గత కమిటీని కూడా ఏర్పాటు చేసి ఫిర్యాదు చేసిన మహిళలకు న్యాయం చేస్తామని చెప్పారు. సెక్సువల్ హెరాస్‌మెంట్ ఎలక్ట్రానిక్ (ఎస్ఎహెచ్ఈ) బాక్స్ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, కుటీర పరిశ్రమలు, కూలి పని చేసే మహిళలందరికీ ఈ చట్టం వర్తిస్తుందని చెప్పారు. పోష్ చట్టం ప్రకారం ఏదైనా నిబంధన ఉల్లంఘించినా లేదా ఉల్లంఘించడానికి ప్రత్నించినా, యాజమాన్యంపై గరిష్టంగా రూ.50 వేల వరకు జరిమానా విధింస్తారని వివరించారు. యజమాని దోషిగా తేలితే మొదటి సారి విధించిన శిక్షకు రెండు రెట్లు జరిమానా విధించడంతోపాటు, వారి వ్యాపార లైసెన్స్‌ను రద్దు చేస్తారని చెప్పారు. చట్టం గురించి న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ సభ్యులు, పానల్ న్యాయవాదులు, పారా లీగల వలంటీర్లు, నవ్యా సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కరణం



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం.. పక్కనే ఉన్న కరణం వెంకటేష్

మేదరమెట్ల: స్థానిక భ్రమర టౌన్‌షిప్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. కాగా అదే సమయంలో అటుగా కారులో వెళుతున్న వైఎస్సార్‌సీపీ చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్ గమనించి వెంటనే ఆగి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను తక్షణమే వైద్యశాలకు తరలించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఎస్ఐకు సూచించారు. క్షతగాత్రులను దగ్గరుండి వైద్యశాలకు పంపించే వరకూ అక్కడే ఉన్నారు.

యోగాతో శారీరక రుగ్మతలు దూరం



పర్చూరు: యోగా శిక్షకులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ దాసరి చంద్రశేఖర్



సంతమాగులూరు: శిక్షణ పొందుతున్న సచివాలయ సిబ్బంది



కారంచేడులో యోగా తరగతులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉష



జె.పంగులూరు: ఎంపీడీఓ కార్యాలయంలో యోగా చేస్తున్న సిబ్బంది



బల్లికురవలో అభ్యాసం చేస్తున్న దృశ్యం

పర్చూరు(చినగంజాం): యోగా వలన శారీరక రుగ్మతలు దూరం అవుతాయని మండల యోగా పర్యవేక్షకులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. యోగాంధ్ర 2025లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు యోగాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గురువారం అడుసుమల్లి గ్రామంలో 36 మందికి శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా మండలంలోని ప్రతి సచివాలయ ఉద్యోగికి 5 రోజులపాటు, యోగాపై శిక్షణ అందిస్తారని తద్వారా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి యోగాపై అవగాహన పెరుగుతుందన్నారు.

సంతమాగులూరు(అద్దంకి): సచివాలయ ఉద్యోగులకు యోగా ట్రైనర్లుగా శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించినట్లు సంతమాగులూరు ఎంపీడీఓ శింగయ్య చెప్పారు. గురువారం నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 31 వరకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు శిక్షణ ఇస్తారని చెప్పారు. యోగాంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆసక్తి ఉన్న వారిని గుర్తించి రిజిస్టర్ చేస్తున్నట్లు చెప్పారు. యోగా శిక్షణను గురువారం ప్రారంభించినట్లు తెలిపారు. 150 మందికి రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

కారంచేడు: ప్రతిరోజూ యోగా చేయడం వలన ప్రజల్లో శారీరక, మానసిక ఆరోగ్యం, ఉల్లాసం పెరుగుతుందని కారంచేడు హోమియో వైద్యాధికారి డాక్టర్ ఉష అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రమైన కారంచేడు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కె. నేతాజీ, గ్రామ సచివాలయాల సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: యోగా చేయటం వల్ల పూర్తి ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఆయుష్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు మోహన్ అన్నారు. ఆయుష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 41 మందితో యోగా చేయించారు. 5 రోజుల పాటు ప్రతి రోజూ యోగాపై అవగాహన కల్పిస్తామని శారీరక, మానసిక రుగ్మతలు దూరం అవుతాయని మెడికల్ ఆఫీసర్ వివరించారు. ఆయుష్ కాంపౌండర్ వి. శేషశాయి, కార్యాలయ ఏవో పాండురంగ స్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జె.పంగులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక పంగులూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో గురువారం యోగా నిర్వహించారు. పీఎస్ఆర్‌వీఎస్ కృష్ణకుమార్ మెడికల్ అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ కె. స్వరూపారాణి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కాల్ చేయండి

చినగంజాం: మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం, విద్యుత్ సమాచారం తెలుసుకునేందుకు ప్రత్యేకంగా విద్యుత్ శాఖ పరిధిలో కాల్ సెంటర్‌లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ పడవల గణనారాయణ తెలిపారు. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ ఆదేశాల మేరకు మండలంలోని నాలుగు సబ్ స్టేషన్ పరిధిలో కాల్ సెంటర్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయం, గ్రామాల్లో విద్యుత్ సమస్యల కోసం తాము తెలిపిన ఫోన్ నంబర్లకు కాల్ చేసి పరిష్కరించుకోవాలని వివరించారు. ఇందులో భాగంగా సోపిరాల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలయిన సోపిరాల, కడవకుదురు, మున్నంవారిపాలెం, చింతగుంపల, గొనసపూడి గ్రామాల వారు 9490615415, కొత్తపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలయిన చినగంజాం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, మూలగాని వారి పాలెం, రామచంద్రనగర్ పెద్ద పల్లెపాలెం, కొత్తపాలెం గ్రామాల వారు 8332974002, పెదగంజాం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలైన పెదగంజాం, కాటం వారిపాలెం, కోడూరి వారి పాలెం, నీలాయపాలెం, ఆవులదొడ్డి గొల్లపాలెం, బుచ్చిగుంట, పల్లెపాలెం గ్రామాల వారు 9491052216, మోటుపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలైన మోటుపల్లి, అడివీధి పాలెం, రుద్రమాంబపురం, కుంకుడు చెట్లపాలెం, నిరీక్షణగిరి, కృష్ణనగర్ (వడ్డె సంఘం) గ్రామాల వారు 9440816871 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం



కారంచేడులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ నేతాజీ

కారంచేడు: గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొనేలా పాలకవర్గ సభ్యులతో పాటు, పంచాయతీ సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. గురువారం కారంచేడులో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మూడు సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుల ద్వారా సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా అపరిశుభ్రత వాతావరణం కనిపించకూడదన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణలోను సిబ్బంది నిర్లక్షం వీడాలన్నారు. వాటిని సంపూర్ణంగా వినియోగించాలన్నారు. ఈ నెల 21వ తేదీ లోగా గ్రామాల్లో కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఎక్కడా చెత్తా, చెదారంలు దర్శనమివ్వకూడని తెలిపారు. ఊరు బైట చెత్తను కూడా ఎక్కడా వేయకూదన్నారు. ఎల్‌కే కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతకు ఆటలు ఎంతో దోహదపడతాయని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులతో నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి వారి చేత కథలు చెప్పించారు. అనంతరం యోగాంధ్రలో భాగంగా జి.హరిప్రసాద్ యోగా క్లాసులు నిర్వహించారు. వారం రోజులుగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. క్యారమ్స్, చెస్ ఆటలు ఆడించి పోటీలు నిర్వహించారు.

ఉల్లాసంగా వేసవి శిక్షణ తరగతులు

నాగులుప్పలపాడు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో గురువారం ఉల్లాసంగా సాగాయి. ఈసందర్భంగా తెలగతోటి సామ్యూల్ ×టీ₹ మీద పదాలు వివరించారు. అనేపదాల అర్థాలను వివరిస్తూ నవ్విస్తూ బోధించడతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. ఎత్తు బరువు ఆధారంగా ఆరోగ్యం ఎలా ఉంటుందని విషయం గురించి వివరించారు. అమరా మానస లక్ష్మీప్రియ విద్యార్థులకు చిన్న పేపర్ సాయంతో క్విజ్ నిర్వహించారు. చిన్నచిన్న నీతి కథల గురించి చెప్పారు. 16 మంది విద్యార్థులు హాజరయ్యారని లైబ్రేరియన్ ప్రసాద్ తెలిపారు.

ఆకట్టుకున్న హాస్య నాటిక



నృత్య ప్రదర్శన చేస్తున్న ప్రణయా రెడ్డి

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణలో లలిత కళా సమితి 73వ వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో కళలు అంత రించి పోతున్నాయన్నారు. నాటక రంగం పూర్తిగా కనమరుగైయిందన్నారు. అయినప్పటికి 73 ఏళ్లగా లలిత కళాసమితి ద్వారా కళలను ప్రోత్సహిస్తూ కళాకారుల సన్మానిస్తున్నామన్నారు. అనంతరం పాలకొల్లు ప్రణయారెడ్డి, దేవన నవ్యశ్రీ నృత్య ప్రదర్శించిన ఆహుతులను అలరింప జేశాయి. కళాసమితి కార్యదర్శి ఆవుల పున్నయ్య దేర్యోధన ఏకపాత్ర (మయసభ) ప్రదర్శన ఆకట్టుకుంది. చీరాలకు చెందిన పూర్ణోదయ ఆర్ట్స్, వారిచే పుట్టుక్కు జర జర దుబుక్కు మే హాస్య నాటిక ప్రదర్శించారు. చివరగా వివిధ కళాకారులను ఘనంగా సన్మానించారు. వడలి రాధాకృష్ణ, ఎస్. అమృతవర్షిని, నరాల శెట్టి రవికుమార్, సమితి శాశ్వత కన్వీనర్ లొల్లా శ్రీరామూర్తి, కో కన్వీనర్ జి. రవిబాబు, గౌరవాధ్యక్షులు గొల్లపూడి సీతారాం, గౌరవ సలహాదారులు స్వర్ణ ప్రయాగరావు గొసనం నాగమాంబ పాల్నొన్నారు.

గడపదాటని బర్లీ పొగాకు



కూకట్లపల్లిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బర్లీ పొగాకు చెక్కులు

బల్లికురవ: బర్లీ పొగాకు సాగుచేసిన రైతులు కోనే నాథుడు లేక పంట సాగకు తెచ్చిన పెట్టుబడులు ఎలా తీర్చాలో అంతు చిక్కక అయోమయంలో ఉన్నారు. మండలంలోని 20 రైతు సేవాకేంద్రాల పరిధిలో గత ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో నల్లబర్లీ, తెల్ల బర్లీ సాగును 860 ఎకరాల్లో చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో క్వింటాళ్లు రూ. 14 వేల నుంచి రూ. 18 వేల వరకు వ్యాపారులు పోటీపడి రైతుల వద్ద కొనుగోలు చేశారు. దీంతో రైతులకు లాభాలు దక్కాయి. అయితే ఈ ఏడాది ఎకరా పంట సాగుకు సొంత భూమి రైతుకు రూ. 1.2 లక్షల నుంచి రూ. 1.4 లక్షల వరకు పెట్టుబడుల య్యాయి. దిగుబడులు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు వచ్చాయి. కానీ కొనేవారు లేక.. పెట్టుబడులు ఎలా తీర్చాలో రైతులకు అంతుచిక్కటం లేదు. వ్యాపారులంతా సిండికేట్ అయి ధరలను దిగజార్చుతున్నారు. ప్రభుత్వం మద్దత్తు ధర క్వింటాలు రూ. 15 వేలు తగ్గకుండా కొనుగోలు చేస్తేనే బతికి బట్ట కడతామని.. రైతులు తాటిపర్తి భాస్కర రెడ్డి నిమ్మల లక్ష్మయ్య తెలిపారు.